క్లుప్తంగా

మాధవరంలో కేంద్ర బలగాల కవాతు



కవాతు చేస్తున్న పోలీసులు, పారా మిలటరీ సిబ్బంది

మంత్రాలయం: సాధారణ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని మాధవరం గ్రామంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. మాధవరం, మంత్రాలయం ఎస్‌ఐలు కృష్ణమూర్తి, గోపీనాథ్ నేతృత్వంలో పారా మిలటరీ పోలీసులు గ్రామ వీధుల్లో కవాతు చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి విశేష పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు అగసలదిన్నె, బుడుములదొడ్డి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామికి పూజలు చేశారు. తెల్లవారుజామున అర్చకులు స్వామి వారికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు జరిపించారు. అలాగే స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో శని త్రయోదశి పూజలు



మృత్యుంజయ హోమంలో పాల్గొన్న భక్తులు

ఆదోనిఅర్బన్: శనిత్రయోదశి సందర్భంగా శనివారం స్థానిక మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు నిర్వహించారు. ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో స్వామివారికి తేనెతో అభిషేకం, ఫల పంచామృతాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం శని పరిహార పూజలు చేసి, భక్తులు తెచ్చిన నువ్వుల నూనెతో శనికి అభిషేకం చేశారు. శనిదోష పరిహార పూజలు వేద పండితులు గరుడాద్రి దత్తాత్రేయశర్మ, గురురాజ ఆచార్యుల ఆధ్వర్యంలో జరిగాయి. శనీశ్వరుడికి తైలాభిషేకం, మృత్యుంజయ హోమం జరిపించారు.

క్షయవ్యాధిని నిర్మూలిద్దాం



ప్రదర్శనగా వెళ్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ, వైద్యులు, సిబ్బంది

ఆదోనిటౌన్: ప్రజల పాలిట శాపంగా మారిన క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలిద్దామని, అందుకు ప్రతిఒక్కరు సహకరించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సత్యవతి పిలుపునిచ్చారు. శనివారం ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా పట్టణంలో రాబర్ట్ కాచ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఈసీహెచ్ బాలమురళీకృష్ణ, డాక్టర్లు రవికుమార్‌తో కలిసి మాట్లాడారు. అనంతరం సిబ్బందితో కలిసి పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పాలన



ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

కౌతాళం: వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి, సంక్షేమ సాధ్యం అవుతుందని ఆ పార్టీ మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, నాయకుడు ఈడిగ శివ అన్నారు. శనివారం కౌతాళంలోని రాఘవేంద్ర కాలనీ, ఉప్పరవీధుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని, బాలనాగిరెడ్డిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌గౌడ్, గోవర్ధన్, నాగరాజ్‌గౌడ్, ఆలం పాల్గొన్నారు.

రంగనాథుడికి వెండి పాదుకలు కానుక

మద్దికెర: రంగనాథస్వామికి అదే గ్రామానికి చెందిన శేషం రంగన్న రూ.50 వేలు విలువ చేసే అర కిలో వెండితో తయారు చేసిన పాదుకలను ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డిలకు శనివారం అందజేశారు.

పల్లె ప్రయాణం.. సుఖమయం



డి.బెళగల్- రచ్చమర్రి రోడ్డు



కామన్‌దొడ్డి- కందుకూరు రోడ్డు

- పల్లెదారులకు మహర్దశ
- తీరిన పల్లెవాసుల దారి కష్టాలు



మంత్రాలయం: పల్లెదారులు అధ్వానం అంటూ ప్రతిపక్షాలు నానా యాగి చేశాయి. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో వేసిన రోడ్లపై టీడీపీ ప్రభుత్వం షికారు చేసింది. ఐదేళ్ల కాలంలో పల్లెదారులను పట్టించుకున్న పాపా న పోలేదు. అడుగడుగునా గతుకులు, ప్రమా ద ఘంటికల మధ్య నరకప్రాయంగా పల్లెవాసుల ప్రయాణం సాగింది. వైఎస్సార్ ప్రభు త్వం పల్లెదారుల రూపురేఖలను మార్చేసింది. కోట్లాది రూపాయలు వెచ్చించి పల్లెరోడ్ల కు మహర్దశ తీసుకొచ్చింది. దారి కష్టాలు తీరడంతో పల్లెజనం హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో ఐదేళ్లలో 20 రోడ్ల నిర్మాణం చేపట్టింది. పల్లెవాసుల ప్రయాణాలకు ఎలాంటి ఆటంకం లేకుండా చేసింది. పల్లెదారులు బాగుపడటంతో గ్రామీణులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణానికి తీవాచీలు

అత్యవసర సమయాల్లో గుంతలమయంగా మారిన దారుల్లో ప్రయాణం ప్రాణసంకటంగా ఉండేది. గంటల తరబడి ప్రయాణం చేసి ఒళ్లు గుల్ల చేసుకునే దుస్థితి. నేడు దారి కష్టాలు పూర్తిగా తొలగిపోయాయి. తీవాచీల్లా దారులు నిర్మాణం కావడంతో ఎంతో హాయిగా ప్రయాణాలు కానిస్తున్నారు. ప్రతిపక్షాలు రోడ్లపై చేస్తున్న రాద్ధాంతంపై ప్రజానీకం విస్తుపోతున్నారు.



కోసిగి-డి.బెళగల్ బీటీ రోడ్డు

మంత్రాలయం నియోజకవర్గంలో నిర్మించిన బీటీ రోడ్ల వివరాలు

రహదారి	కిలో మీటర్లు	వ్యయం (రూ.కోట్లలో)
ఉరకుంద-ఎరిగేర	9	రూ. 3కోట్లు
నదిచాగి- బాపురం	7	రూ. 2 కోట్లు
డి.బెళగల్-రచ్చమర్రి	6	రూ. 2.50 కోట్లు
మాలపల్లి-కోసిగి	9.5	రూ. 3 కోట్లు
డి.బెళగల్-కోసిగి	4.6	రూ. 5.50 కోట్లు
సాతనూరు-దుద్ది	9	రూ.2.5 కోట్లు
కోసిగి-జుమ్మాలదిన్నె	6	రూ.1.6 కోట్లు
కామన్‌దొడ్డి- కందుకూరు	3.9	రూ. 1.5 కోట్లు
మేకడోణ-పెద్దతుంబళం	7	రూ.1.95 కోట్లు
మేకడోణ- ముచ్చగిరి అప్రోచ్ రోడ్డు		రూ. 90 లక్షలు
బదినేహాల్-కుంటనహాల్	5	రూ.1.40 కోట్లు
కుంటనహాల్-హచ్చొళ్లి	11	రూ.2.0 కోట్లు
కౌతాళం - ఉప్పరహాల్	5.5	రూ. 1.25 కోట్లు
కౌతాళం - హాల్వి	6 కి.మీ.	రూ.1.50 కోట్లు
నదిచాగి - మేళిగనూరు	3 కి.మీ.	రూ.1.20 కోట్లు
హాల్వి బైపాస్‌రోడ్డు	6	రూ. 50 లక్షలు
బాపురం వంక బ్రిడ్జి		రూ.50 లక్షలు
బదినేహాల్ వకం బ్రిడ్జి		రూ. 50 లక్షలు
చిర్తనగల్ - మూగలదొడ్డి	3.8	రూ. 27.02 లక్షలు
ఆదోని మెయిన్‌రోడ్డు- సుంకేశ్వరి	2.5	రూ. 55 లక్షలు
పెద్దకడబూరు బైపాస్‌రోడ్డు	1.2	రూ. 60 లక్షలు



బాపురం-నదిచాగి దారి



ఎరిగేరి - ఉరకుంద తారురోడ్డు

మా ఊరి రోడ్డు బాగుపడింది



కోసిగి మండల కేంద్రానికి వెళ్లాలంటే 9 కి.మీ. ప్రయాణం చేయాల్సి ఉంది. ఏదైనా అత్యవసరం వస్తే ప్రయాణం కష్టంగా ఉండేది. ప్రభుత్వం రోడ్డు వేయడంతో కష్టాలన్నీ తీరిపోయాయి. మా గ్రామ ప్రజలంతా రోడ్డు నిర్మాణంపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వాలు మా ఊరి రస్తాను పట్టించుకున్న పాపాన పోలేదు. –నాగిరెడ్డి, కందకూరు

పాలన బాగుంది



పేదల సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగింది. కేవలం నగదు బదిలీతో పాలన సాగిందని కొందరు ఆరోపణలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే సంక్షేమ స్థాయిలోనే ప్రగతి పనులు కూడా కనిపిస్తాయి. నిందలు వేయడం కన్న నిజం తెలుసుకోవడం మంచిది. ఇలాంటి ప్రభుత్వం ఉంటేనే పల్లెలు బాగుపడతాయి.

–బి.జగదీష్, కల్లుదేవకుంట

సెలవు దినాల్లోనూ పన్నులు చెల్లించవచ్చు

ఆదోని అర్బన్: బకాయి ఉన్న ఆస్తి పన్నుపై ప్రభుత్వం వడ్డీ మాఫీ చేసినందున ఈనెల 24, 25వ తేదీల్లోనూ మున్సిపల్ కార్యాలయంలో ఆస్తి, ఖాళీ స్థలం, నీటి పన్నులు చెల్లించవచ్చని, ఇందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఐ

తుగ్గలి: తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి 41 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మల్లికార్జున మాట్లాడుతూ.. తాళాలు వేసిన ఇళ్లు చూసుకుని చోరీలకు పాల్పడుతున్న తుగ్గలి మండలం రాంపల్లికి చెందిన బోయ అగ్రహారం రంగస్వామిని శనివారం ఏఎస్ జూనియర్ కాలేజీ సమీపంలో అరెస్ట్ చేసినట్లు చెప్పారు. తుగ్గలిలో ఓ కేసుకు సంబంధించి బంగారు గొలుసు, ఉంగరం, జత కమ్మలు, చిన్న పిల్లలకు చెందిన మూడు ఉంగరాలు, పత్తికొండ స్టేషన్ పరిధిలో ఓ కేసుకు సంబంధించి బంగారు గొలుసు, జత కమ్మలు, జత మాటీలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

యువతా.. ఓటరుగా నమోదు చేసుకో

- నమోదుకు ఏప్రిల్ 15వ తేదీ వరకు అవకాశం



ఆదోని సెంట్రల్: పద్దెనిమిది సంవత్సరాల వయస్సు నిండిందా..త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఓటు వినియోగించుకోవాలా.. అయితే వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎన్నికల కమిషన్ సూచిస్తోంది. నమోదుకు ఏప్రిల్ 15వ తేదీ వరకు అవకాశముందని చెబుతోంది. సార్వత్రిక ఎన్నికలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. తుది ఓటరు జాబితాలో మీ పేరు ఉందో లేదో చూసుకోవాలి. ఒక వేళ పేరు లేకపోతే మీరు ఓటు వేయడానికి అనర్హులు. ఇలాంటి వారి కోసం కేంద్ర ఎన్నికల సంఘం చివరి అవకాశం కల్పించింది. ఏప్రిల్1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అర్హులైన వారు ఏప్రిల్ 15వ తేదీ లోపు ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించి, సక్రమంగా ఉంటే ఓటరు తుది జాబితాలో పేరును పొందుపరుస్తారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఇలా..

మొబైల్‌లో ఓటరు హెల్ప్‌లైన్ యాప్ ద్వారా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చు. డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ nvsp. in వెబ్ సైట్‌లో మీ ఫోన్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకుని లాగిన్ కావాలి. ఆన్‌లైన్ దరఖాస్తులోని వివరాల ఆధారంగా బూత్‌స్థాయి అధికారి మీ అడ్రస్‌కు వచ్చి వివరాలను పరిశీలించి, నిర్ధారించుకున్న తర్వాత ఓటరు జాబితాలో మీ పేరును చేరుస్తారు. అలాగే https// voterportal. eci. gov. in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫోన్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలి. లాగిన్ అయ్యాక వెబ్ సైట్‌లో న్యూ ఓటర్ రిజిస్ట్రేషన్‌లోకి వెళ్లి వివరాలను పొందుపరిస్తే నిర్ధారించుకున్నాక మీ పేరు ఓటరు జాబితాలో చేరుస్తారు.

అర్హత ఉందా..

మీకు అర్హత ఉండి, 18 ఏళ్లు నిండిన వారు ఆఫ్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. మీరు ఫాం -6 లో మీ పూర్తి వివరాలను నమోదు చేసి బూత్ లెవెల్ (బీఎల్‌వో) అధికారికి దరఖాస్తును అందజేయాలి. మండల స్థాయిలో అయితే తహసీల్దార్ కార్యాలయంలో కొత్త ఓటరు కోసం పూర్తి చేసిన దరఖాస్తులనుఅందజేయవచ్చు.దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత పేరును ఓటరు జాబితాలో చేరుస్తారు. సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1950 కు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

మిర్చికి గిట్టుబాటు ధర కల్పించండి



ఆదోని వ్యవసాయ మార్కెట్ సిబ్బందికి వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

పెద్దకడబూరు: మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు భాస్కర్‌యాదవ్, ఆదోని పట్టణకార్యదర్శి సుదర్శన్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆదోని వ్యవసాయ మార్కెట్ సిబ్బందిని కలిసి వినతిపత్రం సమర్పించారు. రైతులు డీలక్స్, తేజా డీలక్స్, త్రిబుల్ ఫైవ్ వంటి ఎన్నో రకాలు పంటలు పండించినా సరైన ధరలు లేక తీవ్ర నిరాశకు గురవుతున్నారన్నారు. మిర్చి పంట పండించడానికి రసాయన ఎరువులు, పురుగుల మందులు, కూలీలకు రూ.లక్షలు ఖర్చుపెట్టినా పంట చేతికి అందే సమయానికి ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ప్రభుత్వమే వారిని ఆదుకోవాలని కోరారు. నాయకులు, రైతులు నరసప్ప, షేక్షావలి, ఎల్లప్ప, తిక్కన్న, ఓంకారస్వామి, గోపాలు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు



గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి

పెద్దకడబూరు: బైకు ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన మండల పరిధిలోని నాలుగో మైలు రాయి కంబద హాల్ రహదారిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మంత్రాలయం మండలం బాపురం గ్రామంలో దేవర సందర్భంగా పెద్దకడబూరు గ్రామానికి చెందిన వ్యక్తి (పేరు తెలీదు) బాపురం గ్రామం నుంచి నాలుగో మైలురాయి దగ్గరకు నడుచుకుంటూ వస్తున్నాడు. అదే సమయంలో బాపురం గ్రామానికి చెందిన వ్యక్తి వెంకటేష్ తప్పతాగి ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. తాగిన మైకంలో పాదచారుడిని ఢీకొనడంతో గాయపడ్డాడు. ద్విచక్ర వాహనదారుడు పక్కనున్న పొలంలో పడిపోయాడు. ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో 108కు సమాచారం అందించి ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ మహేష్‌కుమార్‌ను వివరణ కోరగా పూర్తి సమాచారం తెలియదన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను సాధిద్దాం



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



104బసాపురంలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఆదోనిసెంట్రల్: యువత భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఆదర్శంగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు,నాయకులు గౌస్, దినేష్, రాజు, శ్రీనివాస్, గణేష్, నాగరాజు, గౌడ్, సూర్య, రంజాన్ పాల్గొన్నారు.

ఆదోనిరూరల్: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుకుదేవ్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఐ గ్రామ కార్యదర్శి కరెంట్ ఈరన్న, సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు అన్నారు. శనివారం మండలంలోని 104 బసాపురం గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే.. ఆదోని పట్టణంలోని సుందరయ్య భవనంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి పి.ఎస్.గోపాల్, ఏఐటీయూసీ పట్టణ నాయకులు ఓ.బి.నాగరాజు, ఐఎఫ్‌టీయూ నాయకులు వెంకప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు బి.రామాంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు మల్లికార్జున, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశులు నివాళులర్పించి భగత్‌సింగ్ సేవలను కొనియాడారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

కౌతాళం: భగత్‌సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం నాయకుడు మల్లయ్య కోరారు. శనివారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతిని జరుపుకున్నారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అతిపిన్న వయస్సులో దేశ స్వాతంత్ర్యంలో చురుగ్గా పాల్గొని తెల్లవారిని ఎదిరించిన నాయకుడు భగత్‌సింగ్ అన్నారు. ఆయన ఉద్యమ స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను సాధిద్దాం

పెద్దకడబూరు: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ ఆశయాలను సాధిద్దామని ఏఐవైఎఫ్ నాయకులు జాఫర్‌పటేల్, మహమ్మద్ హుస్సేన్, దస్తగిరి అన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయులు, వీరుల బాటలో నడుద్దామన్నారు. సీపీఐ నాయకులు వీరేష్, ఆంజనేయ, శ్రీరాములు పాల్గొన్నారు.

కోసిగి: స్థానిక ఇంటిగ్రేడ్ హాస్టల్‌లో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. దేశం కోసం ఆయన చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ఆంజి, నాయకులు ఆనంద్, నబి, రసూల్బి తదితరులు పాల్గొన్నారు.



పెద్దకడబూరు: భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

శేష వాహనంపై శ్రీరంగనాథుడు



శేషవాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో కొలువుతీరిన శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవి సతీసమేతుడై శనివారం శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శేషోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమకతాడు టోల్‌ప్లాజా వద్ద చోరీ

- మహిళ మెడలో బంగారు నగల అపహరణ



సంఘటనా స్థలంలో విచారణ జరుపుతున్న కృష్ణగిరి ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి

కృష్ణగిరి: అమకతాడు టోల్‌ప్లాజా వద్ద శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. టోల్‌ప్లాజాకు 50 మీటర్ల దూరంలో కారులో నిద్రిస్తున్న మహిళ మెడలోని బంగారు నగలను గుర్తు తెలియని వ్యక్తి ఆపహరించాడు. అనంతపురం జిల్లా కదిరి పట్టణానికి చెందిన భార్యాభర్తలు ఫణిస్వామి, రామపెద్ది భాగ్యలక్ష్మి కారులో డ్రైవర్ ఫణీంద్రతో కలిసి హైదరాబాదులో గృహ ప్రవేశానికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. శనివారం తెల్లవారుజామున డ్రైవర్ నిద్రవస్తుందని చెప్పగా అమకతాడు టోల్‌ప్లాజా దాటి 50మీటర్ల దూరంలో కారు ఆపి నిద్రపోయారు. మూడున్నర గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి కారులో ఉన్న రాయపెద్ది భాగ్యలక్ష్మి మెడలోని బంగారు నగలను తెంపుకొని సమీపంలోని పొలాల్లోకి పారిపోయాడు. బాధితురాలు కేకలు వేయగా డ్రైవర్ దొంగను పట్టుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. తాళిబొట్టు గొలుసుతోపాటు బంగారు నెక్లెస్, నల్ల పూసల దండలు దాదాపుగా ఆరు తులాలు ఉన్నట్లు బాధితురాలు తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కృష్ణగిరి ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కాగా టోల్ ప్లాజాకు ఇరువైపులా వంద మీటర్ల వరకు లైటింగ్ లేకపోవడం, సీసీ కెమెరాలు సరిగ్గా పనిచేయకపోవడం వల్లే దొంగతనాలు జరుతున్నట్లు తెలుస్తోంది.

సంతానం కలగలేదని ఆత్మహత్య



కృష్ణవేణి మృతదేహం

ఆలూరు రూరల్: సంతానం కలగలేదనే మనస్తాపంతో కృష్ణవేణి (28) అనే వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బళ్లారికి చెందిన కృష్ణవేణిని హాలహర్వి మండలం మెదేహాల్ గ్రామానికి చెందిన కృష్ణతో పదేళ్ల క్రితం వివాహం చేశారు. పదేళ్లవుతున్నా తనకు పిల్లలు కలగలేదని కృష్ణవేణి బాధపడుతూ ఉండేది. మనస్తాపంతో శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బంధువులు ఆమెను హాలహర్వి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆలూరు ఆస్పత్రికి రెఫర్ చేశారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆస్పరి: మండలంలోని నగరూరు రైల్వే బ్రిడ్జి వద్ద శనివారం కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆస్పరి సీఐ హనుమంతప్ప తెలిపారు. ఆలూరు మండలం మూసనహళ్లి గ్రామానికి చెందిన బోయ ధనుంజయ, బోయ శేఖర్ మూసనహళ్లి నుంచి 13 బాక్సుల్లో 1248 టెట్రా ప్యాకెట్లను నగరూరు వైపు తీసుకొస్తుండగా వెంబడించామన్నారు. పోలీసులను చూసి రైల్వే బ్రిడ్జి సమీపంలో వదిలేసి పారిపోయారని తెలిపారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశామని వెల్లడించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.

22 మంది బైండోవర్



తహసీల్దార్ ఎదుట హాజరుపరుస్తున్న ఎస్‌ఐ

పెద్దకడబూరు: మండల పరిధిలోని హనుమాపురం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు 22 మందిపై ఎస్‌ఐ మహేష్‌కుమార్ శనివారం బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దార్ సురేష్‌బాబు ముందు హాజరుపరిచారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎస్‌ఐ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో రౌడీషీటర్లపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. అందులో భాగంగానే హనుమాపురం గ్రామానికి చెందిన రౌడీషీటర్లు, శాంతభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు, వివిధ ఘర్షణల్లో కేసులు నమోదైన వ్యక్తులను గుర్తించి 22 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

అనారోగ్యంతో మేకడోణ సర్పంచ్ మృతి



కృష్ణగౌడ్ (ఫైల్)

పెద్దకడబూరు: మండల పరిధిలోని మేకడోణ సర్పంచ్ ఈ. కృష్ణగౌడ్ (82) అనారోగ్యంతో శనివారం సాయంత్రం మృతి చెందాడు. రెండేళ్లుగా అనారోగ్యంతో ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూల్ తదితర ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నారు. పరిస్థితి విషమించడంతో శనివారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఎంపీపీ శ్రీవిద్య, జెడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, పార్టీ నాయకులు వై.ప్రదీప్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రవిచంద్రరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

కొనసాగిన నామినేషన్ ప్రక్రియ

ఆదోని రూరల్: ఆదోని బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. రెండో రోజు శనివారం కూడా పలువురు న్యాయవాదులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 27వ తేదీన ఉదయం 9;30 నుంచి 3 గంటల వరకు ఓటింగ్ ఉంటుందని, అదేరోజు సాయంత్రం 4 గంటలకు కౌటింగ్ ఉంటుందని న్యాయవాదులు తెలిపారు.